

హైదరాబాద్ వార్త

## ఎలివేటర్లపై జీఎస్టీ తగ్గించి.. లిఫ్ట్ యాక్ట్ తేవాలి

### ప్రభుత్వానికి తెలంగాణ ఎలివేటర్ అసోసియేషన్ వినతి

**హైదరాబాద్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఎలివేటర్లపై ఉన్న18 జీఎస్టీ విషయంలో పునరాలోచించాలని తెలంగాణ ఎలివేటర్ అసోసియేషన్ (టీఈఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. జీఎస్టీని తగ్గిస్తే దేశంలో అందుబాటులో గృహనిర్మాణంపై సానుకూల ప్రభావం పడుతుందని తెలిపింది. దేశంలో వృద్ధుల సంఖ్య పెరుగుతుండడం, నగరాల్లో ఆకాశహర్మ్యాలు వస్తుండడం వల్ల ఎలివేటర్లు ఇప్పుడు విలాసవస్తువులు కావని, అవి అత్యవసరం అయ్యాయని తెలిపింది, ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఎలివేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా అవినాష్ మాట్లాడుతూ, ప్రధాన జనరల్ సెక్రటరీ బి.కె.గౌడ్‌లు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ "చిన్న, మధ్యతరహా ఎలివేటర్ ఉత్పత్తిదారులు, ఇన్‌స్టాలర్లు తెలంగాణలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. పొరుగురాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంవత్సరం ఏప్రిల్ 12న లిఫ్ట్ చట్టం తీసుకొచ్చారని తెలంగాణలోనూ ఇలాంటి విధానం ఒకటి వీలైనంత త్వరగా తేవాలన్నారు. ప్రత్యేకంగా లిఫ్ట్ చట్టం ఉండడం వల్ల పరిశ్రమ కార్యకలాపాలు క్రమబద్ధం అవుతాయన్నారు. స్పష్టమైన భద్రతా ప్రమాణాలు నిర్దేశించుకుని వినియోగదారులకు నాణ్యతను అందించవచునన్నారు. ఎలివేటర్లు ఇప్పుడు విలాసం కాదని ముఖ్యంగా వైద్యపరమైన అవసరాలున్న సీనియర్ సిటిజన్లకు, బహుళ అంతస్థుల భవనాల్లో నివసించే కుటుంబాలకు ఇవి చాలా అవసరం' అన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే ఇప్పటివరకు 5వేల ఎలివేటర్లు ప్రతినెలా ఇన్‌స్టాల్ అవుతున్నాయని, సగటున ఒక్కోదానికి రూ.8 లక్షలు ఖర్చవుతుందని, అంటే నెలకు ఇందులో రూ.400 కోట్ల మార్కెట్ ఉందని చెప్పారు. అయితే 18 జీఎస్టీ వల్ల గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో లిఫ్టులు పెట్టించుకోవడానికి ప్రజలు వెనకాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పన్నుల విషయంలో కొంత ఊరట కల్పించడంతో పాటు తగిన నియంత్రణపరమైన సంస్కరణలు తీసుకొస్తే ఎలివేటర్ పరిశ్రమకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని సంఘ ప్రతినిధులు తెలిపారు.

## సొరంగాల్లో పూడికతీతకు

# రోబోటెక్నాలజీ



అమీర్‌పేట్‌లో పూడిక తీతపనులను పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** అమీర్‌పేట మెట్రో స్టేషన్ వద్ద కాలువల్లో పూడిక తీసే పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాలకు మెట్రో స్టేషన్ పరిసరాలు నీట మునిగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆప్రాంతాలను పరిశీలించడం. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించడం అందరికీ తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలన్నీ వరద ముంచెత్తడానికి కారణాలపై అధ్యయనం చేశాయి. మెట్రో స్టేషన్ కింద ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్లు కొన్ని పూర్తిగా బ్లాక్ అవ్వడం.. మరి కొన్ని పాక్షి కంగా మూసుకుపోవడాన్ని గమనించారు. వెంటనే పూడిక తీత పనులను చేపట్టారు. పై నుంచి వచ్చే కాలువల్లో పేరుకుపోయిన పూడికను హైడ్రా, జీహెచ్ ఎంసీ సంయుక్తాధ్వర్యంలో తొలగించాయి. ప్రధాన రహదారి కింద ఉన్న బాక్సు డ్రైన్లలో పూడికను తొలగించడానికి రోబోటెక్నాలజీని వాడాల్సిన అవసరాన్ని అధికారులు ఈ సందర్భంగా కమిషనర్‌కు వివరించారు. రోబో టెక్నాలజీతో గట్టిగా మారిన పూడికను సొరంగ మార్గాల్లో మట్టి తీసిన మాదిరి తొలగించి ఒకదాని తర్వాత ఒకటి క్లియర్ చేయవచ్చునన్నారు. రోబో టెక్నాలజీతో మెహిదీపట్నం ఎన్ ఎం డీసీ వద్ద భూగర్భ లైన్లలో పూడికను తొలగించిన విధానాన్ని వివరించారు. అదే మాదిరి అమీర్‌పేట మెట్రో స్టేషన్ కింద కూడా చేయవచ్చునని తెలిపారు. రోబో టెక్నాలజీతో పూడికను తొలగించే విధానాన్ని కమిషనర్‌కు వివరించారు. ప్రధాన రహదారి కింద ఉన్న బాక్సు డ్రైన్లు తెరచుకుంటే చాలావరకు వరద సమస్యను పరిష్కరించవచ్చునని.. రోబో టెక్నాలజీతో నాలుగైదు రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని అక్కడ పనులను పర్యవేక్షి స్తున్న హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు కమిషనర్‌కు వివరించారు.

# మనీ ఇస్తేనే పని..



అవినీతి బకాసురులకు కేరాఫ్‌గా మారిన నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయం

### నార్సింగి మున్సిపాల్టీలో అవినీతి దందా
### భవన నిర్మాణాలకు అనుమతుల్లో ఇష్టారాజ్యం
### విసిగిపోతున్న స్థానికులు
### అక్రమార్కుల భరతం పట్టేందుకు సిద్ధం

**నార్సింగి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తమ పని తాము చేసేందుకు కూడా ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న కొంత మంది అధికారులు ప్రజల వద్ద నుంచి లంచాలు తీసుకుంటూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. ఏ పని చేసేందుకు ప్రభుత్వం నుంచి నెలనెలా జీతాలు తీసుకుంటున్నారో ఆ పనికి కూడా బాధిత ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఏసీబీ అధికారులు నిత్యం ఏదో ఒక దగ్గర మున్సిపల్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, పోలీసు, ఇరిగేషన్, రవాణా శాఖ కార్యాలయాలలో పని చేస్తున్న లంచావతారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కటకటాల వెనక్కి నెడుతున్నా లంచావతారుల్లో బెరుకు కనిపించడం లేదు. లంచాలు తీసుకుంటూ పట్టుబడకుంటే కోట్లకు పడగలెత్తవచ్చు, పట్టుబడితే సగం జీతం తీసుకొని కోర్టు చుట్టూ తిరుగ వచ్చు, మళ్లీ ఉద్యోగంలో చేరవచ్చన్న ధీమానే కనిపిస్తుంది తప్పా, లంచం తీసుకుంటే మా ఉద్యోగాన్ని పూర్తిగా కోల్పోతామని, మా కుటుంబాలు రోడ్డున పడుతాయన్న భయం లంచావతారుల్లో అస్సలు కనిపించడం లేదు. నిత్యం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ అధికారి అంటూ ప్రసార సాధనాలు, దినపత్రికలలో వార్తలు వస్తున్నా లంచం తీసుకునే వారు వెనక్కి తగ్గడం లేదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు దాని శివారుల్లో ఉన్న ప్రాంతాలలో పని చేసే అధికారులు లక్షల రూపాయల లంచాలు తీసుకుంటూ అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తుతున్నారు. 25-30.ఏళ్ల ప్రభుత్వ అధికారులుగా పని చేసినా సంపాదించలేనంత డబ్బులు లంచం రూపంలో ఐదారేళ్లు తీసుకొని పక్కకి జరిగినా పరువాలేదన్న ధీమా లంచావతార అధికారుల్లో కనిపిస్తోంది. పరువుకన్నా పైకానికే వీరు ప్రాధాన్యతనిస్తున్నారు. గతంలో గండిపేట మండల ఇరిగేషన్ శాఖలో పని చేసిన ఓ అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకుంటే వందల కోట్ల రూపాయల ఆస్థులు వెలుగు చూశాయి. ఆయన ఆస్థులు, అంతస్తులు చూసి అధికారులే ఖంగు తిన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉన్నతాధికారులు స్పందించి "లంచం తీసుకొని రెడ్‌హ్యాండెడ్‌గా" పట్టుబడితే శాశ్వతంగా ప్రభుత్వ ఉద్యోగాల నుంచి తప్పించడంతో పాటు, జీవితకాలం జైలుకే పరిమితం చేసేలా పదునైన చట్టాలు తీసుకు రావాల్సిన అవసరం ఉందని మేధావులు, బాధిత ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే లంచం తీసుకునేందుకు ప్రభుత్వ అధికారులు జంకుతారన్న వాదన వినిపిస్తుంది. నార్సింగి మున్సిపాలిటీలో ఓ అధికారి ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడం ఇదే తొలిసారి. గతంలో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బంగ్లాదేశీయులకు బర్త్ సర్టిఫికెట్లు ఇచ్చి కటకటాలపాలయ్యాడు. ఏడెనమిది నెలలు పని చేసిన మేతక కమిషనర్లను పక్కకు తప్పించి నార్సింగి సీటులో ప్రభుత్వంలో పలుకబడి ఉన్న కమీషనర్లు వచ్చి కూర్చున్న సంఘటనలు ఉన్నాయి. తాజాగా మంగళవారం టిపిఓ మణిహారిక ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ కోసం వచ్చిన ఓ వ్యక్తి వద్ద ఏకంగా రూ.4.లక్షలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. మణిహారిక టిపిఓగా వచ్చిన తరువాత పెద్ద ఎత్తున నార్సింగిలో అక్రమ నిర్మాణాలు జరిగాయన్న ప్రచారం జరుగుతుంది. ఇంటి అనుమతికి ఇంతా, అదనపు నిర్మాణాలు చేపడితే ఇంతా, అసెస్మెంట్‌కు ఇంతా, ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్‌కు ఇంతా అని రేట్లు ఫిక్స్ చేసి మరీ వసూలు చేసినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు ఉన్నతాధికారులు మిన్నకుండిపోయారని, వారికి కూడా టౌన్‌ప్లానింగ్ నుంచి వాటాలు ఉండటం వల్లనే ఊరుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా నార్సింగి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో పనులు నడుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. నార్సింగి టిపిఓ మణిహారికకు మా ఉసురు తగిలిందని, అందుకే ఏసీబీకి పట్టుబడిందని నార్సింగి గిరిగిరి గడ్డకు చెందిన ఫుట్ పాత్ వ్యాపారులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. రోడ్ల పక్కన మేము టీకొట్లు, పాన్ డబ్బాలు, పూలు, కూరగాయల వ్యాపారం చేసుకుంటుంటే కళ్ల మండి మమ్ములను అక్కడి నుండి తొలగించిందని, అందుకే ఇప్పుడు దేవుడు ఆమెను ఏసీబికి పట్టించాడని పేర్కొంటున్నారు.

## నకిలీ రిపోర్టర్ల అరెస్టు

### రెవెన్యూ అధికారులమంటూ బెదిరింపు

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** నకిలీ రెవెన్యూ అధికారుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు రిపోర్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ మక్బుల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ఛానల్‌లో రిపోర్టర్లుగా పని చేస్తూ, రెవెన్యూ శాఖ అధికారులమని నమ్మ బలికి అనుమతి లేకుండా బోర్లు వేస్తున్న వ్యక్తులను బెదిరించి ముగ్గురు రిపోర్టర్లు డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. దిల్‌సుఖ్ నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగులు శ్యామ కూరి శివగౌడ్ అలియాస్ శివ (36), సతీష్ (32), నాగఫణీంద్ర అలియాస్ ఫణి రిపోర్టర్ల మంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. 2025 ఏప్రిల్ 19న ఫతుల్లాగూడ ధనలక్ష్మి కాలనీలో పవన్ అనే వ్యక్తి తన ప్లాట్‌లో బోరు వేయి స్తుండగా నిందితులు అతనిని బెదిరించి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.12వేలు గూగుల్ పే ద్వారా శివ అకౌంట్‌కు చెల్లించగా ఆ మొత్తాన్ని ముగ్గురు పంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. తరువాత బాధితుడు ఈ విషయాన్ని ఉప్పల్ తహసీ ల్దార్‌కు సమాచారం ఇచ్చారు. తహసిల్దార్ ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీ సులు కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## నిరంతరం పర్యవేక్షించండి

### ఐలమ్మ వర్శిటీ భవనాల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి

### అధికారులకు కలెక్టర్ ఆదేశం



యూనివర్శిటీ ప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటిని మంగళవారం జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సందర్శించారు. నూతన భవనాల నిర్మాణాలు, పాత భవనాల పునరుద్ధరణ, తదితర అంశాలపై యూనివర్సిటీ వైస్ ఛాన్స లర్ సూర్య ధనుంజయ్, సంబంధిత ఇంజనీ రింగ్ అధికారులతో కలసి యూనివర్సిటీ దర్బార్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన భవనాలు చేపట్టేం దుకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని , సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విశ్వ విద్యాలయ అభివృద్ధి, అలాగే మహిళా శక్తిని మరింతగా ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. నూతన భవనాల నిర్మాణాలతో పాటు పాత భవనాల పునరుద్ధరణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున నిర్దేశించిన సమయానికి పనులను పూర్తిచేయాలని, ఎక్కడ కూడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు ఉండాలన్నారు. అలాగే పనుల పరిశీలనకై నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. యూనివర్సిటీలోని నూతనంగా చేపట్టే అకాడమిక్ బ్లాక్, హాస్టల్, ఆడిటోరియం, స్పోర్ట్స్ బ్లాక్, గెస్ట్ హౌస్ అలాగే పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా పాత భవనాల పునరుద్ధరణలో భాగంగా కెమిస్ట్రీ, ఫిజిక్స్ బ్లాక్స్‌లను కూడా ఆమె పరిశీలించారు. తదుపరి యూనివర్సిటీలోని విద్యార్థుల సంఖ్య 7వేలకు పైగా ఉందని, వసతి గృహంలో దాదాపు వెయ్యికి పైగా విద్యార్థులు ఉంటున్నారని అలాగే వివిధ విభాగలలో అధ్యాపకులు ఐదు వందల వరకు ఉన్నారని కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ వివరించారు. తదుపరి రంగ్ మహల్, సిమెంట్రీ, హెజ్రా హౌస్ ప్రాంతాలలోని పురాతన భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లోక పావని, ఆర్డీవో రామకృష్ణ, ఈ ఈ అనిత, డి ఈ ఆశీర్వాదం, డాక్టర్ అరుణ, డాక్టర్ విజయలక్ష్మి ్మ, వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## 48 గంటలు మంచినీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పేజ్ -1 పథకంలో భాగంగా ముర్మూర్, మల్లారం, కొండపాక పంపింగ్ స్టేషన్లలో 3000 మిమీ డయా ఎమ్.ఎస్. పంపింగ్ మెయిన్‌పై అమర్చబడిన 900 మిమీ డయా వాల్వులు మార్పిడి పనులు జరుగుతున్నాయి. గురువారం ఉదయం 6 గంటల వరకు ఈ పనులు జరుగుతాయని, ఈ నేపథ్యంలో 48 గంటలు పలు రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి అధికారులు పేర్కొన్నారు. ఓ అండ్ ఎం డివిజన్ 6 (ఎస్.ఆర్.నగర్): ఎస్.ఆర్.నగర్ సనత్‌నగర్, బోరబండ, ఎస్‌పిఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంకట్రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమజిగూడ, ఫతేనగర్ సెక్షన్లు, జూబ్లీహిల్స్ కొంత భాగం, తాటిఖానా కొంత భాగం, ఓ అండ్ ఎం డివిజన్ 7: లాలాపేట్ కొంత భాగం, తార్నాక కొంత భాగం, ఓ అండ్ ఎం డివిజన్ 9: కుకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భారత్‌నగర్, మోతీనగర్, మిగతా 3లో

### జిహెచ్ఎంసి ఆస్తి పన్ను డేటా

## విద్యుత్ కనెక్షన్లతో అనుసంధానం

### పిటిఐఎన్‌లను యుఎస్‌సిలతో మ్యాపింగ్
### ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** జీహెచ్‌ఎంసీ టిజిఎస్‌పిడిసిఎల్ సహకారంతో సాంకేతిక విశ్లేషణతో, ఆస్తి పన్ను ఆదాయాన్ని పెంపొందించడానికి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో జీహెచ్‌ఎంసీ ఆస్తి పన్ను గుర్తింపు సంఖ్యలు (పిటిఐఎన్)లు విద్యుత్ సేవా కనెక్షన్లతో (యుఎస్‌సి)లు అనుసంధానించబడుతున్నాయి. జీహెచ్‌ఎంసీ కమిషనర్ మార్గదర్శనం మేరకుఈ ప్రాజెక్టు బహుళ దశల్లో అమలు చేయబడుతోంది.మొదటి దశలో 1 -100 డోర్ నంబర్ల మ్యాచ్ జిహెచ్‌ఎంసిలోని ఆరు జోన్లలో మొత్తం 96,938 నివాస పిటిఐఎన్‌లను విజయవంతంగా నివాసేతర యుఎస్‌సితోఅనుసంధానించబడ్డాయి. అందులో ముఖ్యంగా ఎల్.బి.నగర్ జోన్- 9,761 చార్మినార్ -26,056.. ఖైరతాబాద్ -22,514, సికింద్రాబాద్- 22,005, కూకట్‌పల్లి- 7,260, శేరిలింగంపల్లి- 9,342, మ్యాచ్ చేయగా రెండోదశలో 22,169 రికార్డులు డోర్ నంబర్, పేరు ఆధారంగా సరిపోల్చబడ్డాయి ఈడేటా అనుసంధానం వల్ల జీహెచ్‌ఎంసీ ఆస్తి పన్ను వసూళ్లను బలోపేతం చేయడమే కాకుండా, ఆదాయ లీకేజీలను అరికట్టి, ఆస్తి వినియోగం-విద్యుత్ కనెక్షన్ల మధ్య మరింత జవాబుదారీతనాన్ని తీసుకురావడంలో దోహదం చేస్తుందని అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారులతో జరిగిన సమీక్షా మిగతా 3లో

## ఖైదీలకు క్షమాభిక్షతో పాటు పునరావాసం | కొత్త జీవితానికి ఆశాకిరణం

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ




ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎస్ రామకృష్ణరావు, డిజిపి జితేందర్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించడంతో పాటు పునరావాసాన్ని కల్పించడం నిజమైన సంస్కర ణకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్బీవీఆర్ఆర్ (తెలంగాణ పోలీస్ అకాడమీ) ప్రాంగణంలో 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ - 2025 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్ళు, శిక్షణా సేవల విభాగం, కేంద్ర హోంశాఖకు చెందిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై మొదటిసారిగా ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఎక్స్‌పో, జైలు ఉత్పత్తుల స్టాళ్లను, డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవరణాత్మక సంస్కరణలు ప్రశంసనీయమైనవి. 2024 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంచి ప్రవర్తన కనబరిచిన 231 మంది ఖైదీలను ముందుగానే విడుదల చేయడం జరిగింది. వీరిలో జీవిత ఖైదీలు, ఇతర ఖైదీలు ఉన్నారు. ఇది కేవలం శిక్ష మన్నించడమే కాక, వారికి కొత్త జీవితం ఇచ్చే ఆశాకిరణం. విడుదలైన ఖైదీల పునరావాసం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంధన స్టేషన్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం, మహిళలకు కుట్టుమిషన్లు ఇవ్వడం వంటి కార్యక్రమాలు వారిని తిరిగి సమాజంలో స్థిరపడేలా సాయం చేశాయి.

ఈ సంవత్సరం 21 రాష్ట్రాలతో పాటు 3 కేంద్రపాలిత ప్రాంతాల నుండి 1222 మందికి పైగా అధికారులు, సిబ్బంది పాల్గొనడం విశేషం. మొత్తం 36 విభాగాలలో ప్రొఫెషనల్, క్రీడా, సాంస్కృతిక పోటీలు జరుగుతున్నాయి. టెక్నాలజీ ఎక్స్‌పోలో ఆధునిక జైలు సాంకేతిక పరిజ్ఞానాలు ప్రదర్శించబడుతున్నాయి. అలాగే ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఈ మీట్ సెప్టెంబర్ 11 వరకు కొనసాగనుంది.

ప్రొఫెషనల్ పోటీలు, బహిరంగ క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో జైలు శాఖ సిబ్బంది మధ్య క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావానికి ఇది వేదిక కానుందని తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్ అండ్ సి.ఎస్. డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణ రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హోం) రవి గుప్తా, డీజీపీ డాక్టర్ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ బి. శివధర్ రెడ్డి, బిపిఆర్అండ్‌డీ అదనపు డీజీపీ రవి జోసెఫ్ లోక్కు, ఆర్బీవీఆర్ఆర్ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితర అధికారులు పాల్గొన్నారు.



జియాగూడ స్లాటర్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతి, చీఫ్ ఇంజనీర్ రత్నాకర్ తదితరులు

### ముమ్మరంగా స్లాటర్ హౌస్

## అధునికీకరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** జియాగూడ స్లాటర్ హౌజ్ ఆధునికీకరణ పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలనీ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మంగళవారం కార్వాన్ సర్కిల్‌లోని జియాగూడ కమేళా స్లాటర్ హౌస్‌ను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ (మెయింటనెన్స్) సహదేవ్ రత్నాకర్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్‌లతో కలసి తనిఖీ చేశారు. స్లాటర్ హౌస్ ఆధునికీకరణకు ఇప్పటికే ప్రభుత్వం మిగతా 3లో

## గ్రేటర్‌లో 33 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు

### జిహెచ్‌ఎంసీ సహకారంతో స్వయంసహాయక బృందాలు



జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష యంగా రాష్ట్ర ప్రభు త్వం ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాం టీన్లను స్వయం సహాయక సంఘాలు విజయ వంతంగా నిర్వహిస్తున్నాయి. మహిళలను కోటీశ్వ రులను చేయాలనే లక్ష యంతో గత ఏడాది ఇందిరా మహిళా శక్తి పథకానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నగరంలో జిహెచ్‌ఎంసీ సహకారంతో ప్రస్తుతం నగరంలో 33 కాంటీన్లను మహిళలు నిర్వహిస్తున్నారు. వీటిని నిర్వహిస్తూ సంఘాల మహిళలు ఆర్థిక పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రజలకూ నామమాత్రపు ధరలో పోషకాహార భోజనం అందుతోంది. ఈ కాంటీన్లు మహిళలకు కేవలం ఉపాధి మాత్రమే కాకుండా ఆత్మ విశ్వాసం, స్వావలంబన, గౌరవం కలిగించే మార్గంగా మారాయి. ఎన్‌బిటి నగర్ కు చెందిన స్నేహిత స్వయం సహాయక సంఘానికి చెందిన వసంత, మరో నలుగురు సభ్యులు కలిసి బ్యాంకు నుండి రూ.5 లక్షల రుణం తీసుకుని జిహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో ఇంద్రా మహిళా శక్తి కాంటీన్‌ను ఈ సంవత్స మిగతా 3లో

# మోడల్ సెగ్మెంట్‌గా జూబ్లీహిల్స్

### గత ప్రభుత్వం ఖజానాను అప్పులపాలు చేసింది
### ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయ్
### శాశ్వత పరిష్కారానికి నిధులిస్తున్నామ్
### ఉప ఎన్నికల్లో అఖండ మెజార్టీ ఇవ్వండి
### మంత్రులు తుమ్మల, వివేక్ వెంకటస్వామి

**యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** నగరంలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తగిన విధంగా కృషి చేస్తున్నామని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ చౌరస్తాలో రూ.2.3 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుని అవసరమయ్యే విధంగా పథకాలను ప్రవేశపెడుతూ .. ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాబోయే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బూత్ స్థాయి నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటన్నింటిని శాశ్వత పరిష్కారం చేసేందుకు నిధులు కేటాయించి పనులు చేపడుతున్నమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రతి కార్యకర్త ఇంటింటికి తీసుకువెళ్ళి అర్హులకు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ బాల్‌రెడ్డి రామిరెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగుల రవీందర్‌రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ భవాని శంకర్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, వివేక్ వెంకటస్వామి

## అనుమానాస్పద మహిళకు దేహశుద్ధి

### మతిస్థిమితం లేనట్టుగా ప్రవర్తిస్తుండడంతో హోమ్‌కు తరలింపు

**గచ్చిబౌలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** అనుమానస్పదంగా చిన్నపిల్లల వద్ద తిరుగుతున్న మహిళను గచ్చిబౌలిలో స్థానికులు పట్టుకున్నారు. మహిళ తన వివరాలను తెలుపకపోవడంతో చిన్నపిల్లల కిడ్నాపర్‌గా భావించిన స్థానికులు అనుమానస్పద మహిళను చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసు విచారణలో మహిళ తాను ఎక్కడ ఉంటుంది చెప్పకపోవడం, మతిస్థిమితం లేనట్లు ప్రవర్తిస్తుండడంతో రెస్క్యూ హోంకు తరలించారు. గచ్చిబౌలిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మజీద్‌బండ సమీపంలోని నిర్మాణంలో ఉన్న అనసూయ హిల్స్ లేబర్ క్యాంప్‌కు ఓ అనుమానిత మహిళ వచ్చింది. అక్కడి చిన్నపిల్లల వద్ద కలియ తిరుగుతూ, వారి పక్కనే ఉండసాగింది. దీంతో స్థానికులకు అనుమానం వచ్చి ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో చిన్న పిల్లల కిడ్నాప్‌గా భావించిన స్థానికులు మహిళను చితకబాది దయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. గతకొన్ని రోజుల క్రితమే లేబర్ క్యాంపుల వద్ద ఒంటరిగా ఉండే చిన్నారులను కిడ్నాప్ చేస్తున్న ముఠాను చందానగర్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దీంతో స్థానికులు ముందు జాగ్రత్తగా పోలీసులకు అప్పగించగా, గచ్చిబౌలి పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి మహిళను విచారించారు. విచారణలో తన పేరు పూనమ్(35) అని, మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు చెప్పగా, తన వద్ద సరైన గుర్తింపు కార్డు లభించలేదు. మరోవైపు మహిళా పోలీసులు సదరు మహిళను సమీప ప్రాంతాలకు తీసుకువెళ్లినా తాను ఎక్కడ ఉండేది వెల్లడించలేదు. మతిస్థిమితం లేనట్లుగా వ్యవహరిస్తుండడంతో పోలీసులు ముందు జాగ్రత్తగా అనుమానిత మహిళను హోంకు తరలించారు. మహిళ పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, మహిళతో పాటు మరెవరైనా వచ్చారా అనే కోణంలో స్థానిక సిసి కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థినులకు ఫిట్‌నెస్ క్యాంప్

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** యువతులు, మహిళలు ఫిట్నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించి నిత్యం వ్యాయామం, యోగ వంటి ఆరోగ్యాన్ని పెంపొందించే అంశాలను అలవాటు చేసుకోవాలని ప్రముఖ ఫిట్నెస్ ట్రైనర్ అను ప్రసాద్ సూచించారు. నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక ఫిట్నెస్ క్యాంపులో ఆయన మాట్లాడారు. క్షణం తీరికలేని నగర జీవితంలో శారీరక శ్రమ తగ్గిపోవడంతో పలు రకాల వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని చెప్పారు. ముఖ్యంగా యువతులు, మహిళలు ఊబకాయం వంటి సమస్యలతో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఈ నేపథ్యంలో యుక్త వయసు నుంచే వ్యాయామం, జుంబా, డ్యాన్స్ వంటి ఫిట్నెస్ కార్యక్రమాలు చేయాలని అను ప్రసాద్ సూచించారు. విద్యార్థి దశ నుంచే వ్యాయామానికి సమయం కేటాయించడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే సమస్యలను నివారించవచ్చని కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి ఉదయశ్రీ అనిత పేర్కొన్నారు. క్యాంపులో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ చంద్ర ముఖర్జీ, ట్రైనర్ అను ప్రసాద్‌ను అభినందించారు. విద్యార్థులకు స్కిప్పింగ్ రోప్స్, షటిల్ బ్యాట్స్, గ్రిప్పర్స్ పంచిపెట్టారు.



మాట్లాడుతున్న రత్నాకర్, సత్యనారాయణ, లక్ష్మణ్ తదతరులు

## దళితుల ఐక్యతపై జరిగిన రాజకీయ కుట్రే ఎస్సీవర్గీకరణ

### మాలమహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డా.ఆర్ఎస్ రత్నాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యత పై కేంద్రంలోని బిజెపి మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తగా కుట్ర చేస్తుందని మాలమహానాడు నేషనల్ ప్రెసిడెంట్ డా.ఆర్ఎస్ రత్నాకర్ ఆరోపించారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా చేసి కాంగ్రెస్ పార్టీ బీజం వేస్తే దీన్ని మోడీ దేశం మొత్తం చేశాడని విమర్శించారు. ఈవర్గీకరణ వల్ల వందలో నలుగురికే బెనిఫిట్ జరుగుతోందన్నారు. నలుగురికి ఇచ్చే ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారో చెప్పాలన్నారు. అలాగే తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారో సమాధానం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా మాలలు ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయని ఇక చేసేదేముందని అనుకోవద్దని ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందేనన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. చెంచా గిరికి అలవాటు పడ్డ మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దం సత్యనారాయణ, తెలంగాణ కన్వీనర్ బల్లెం లక్ష్మణ్, నెల్లి సూరిబాబు, తెలంగాణ జనరల్ సెక్రటరీ కామా ప్రభాకర్, కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి

## మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలి

### -గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** హైకోర్టు తీర్పును అనుసరించి మెయిన్స్‌ను రద్దు చేసి తిరిగి పరీక్షలను నిర్వహించాలని, లేదా ఆరు నెలల్లో నిరుద్యోగులకు స్పష్టం చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అశోక్‌నగర్‌లో నిరుద్యోగులతో హైకోర్టు తీర్పు వచ్చిన సందర్భంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులను ప్రతిసారి మోసం చేస్తే కుదరదని, ఇప్పటికే నిరుద్యోగుల వయోపరిమితి కూడా అయిపోతోందని, దీంతో వారు పరీక్షలను రాసే అర్హతలను కోల్పోతారని అన్నారు. వారు ఎటువంటి ఆందోళనకు పిలుపునిచ్చినా తామంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు. తాను గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీగా గెలుపొందానని, వారందరికి అండగా ఉంటామనని, వారిందరికి ఉద్యోగాలు వచ్చేంతవరకు తాను ఉపక్రమించే సమస్యేలేదని, అవసరమైతే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సలహాలను సంప్రదింపులు జరిపి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను సజావుగా జరిపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రూప్1 కేసులో హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం అని వ్యాఖ్యానించారు. నిరుద్యోగ ఆకాంక్షలకా వ్యతిరేకంగా ప్రభుత్వం అవకతవకలకు పాల్పడిందని మండిపడ్డారు.





ఫాతేనగర్, అడ్డగుట్ట, కెపిహెచ్బీ ప్రాంతాల్లో మహేందర్ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నేతలు

## మోడీ ఎప్పటికీ పేదల పక్షపాతే

**మూసాపేట్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** ఫతేనగర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు కంచి మహేందర్ ఆధ్వర్యంలో ఫతేనగర్‌లో మోడీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తీసుకున్న జిఎస్‌టి తగ్గింపు నిర్ణయం దేశ ప్రజలందరికీ ఎంతో మేలు చేస్తుందన్నారు. సాధారణ కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడమే కాకుండా వ్యాపారులకు, రైతులకు కూడ ఊరటనిస్తుందన్నారు. ప్రజల హితాన్ని కోరే మోదీ ఆలోచనలు ఎల్లప్పుడూ పేదలకు అనుకూలంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కూకట్‌పల్లి రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట :** అడ్డగుట్టలో మోదీ చిత్రపటానికి అడ్డగుట్ట బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య పాలాభిషేకం చేపట్టారు. డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి గంబీరావ్‌పేట్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

**కెపిహెచ్బి కాలనీ :** పేద ప్రజానీకానికి దేశ ప్రధాని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో జీఎస్టిపై తగ్గింపు నిర్ణయం తీసుకున్న సందర్భంగా మోదీ చిత్రపటానికి ఫతేనగర్ డివిజన్ బిజెపి నాయకులు కంచి మహేందర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టి 28శాతం 12శాతం స్లాబులతో ఉండడంతో ముఖ్యంగా పేద ప్రజలుపై పడుతున్న అర్థిక భారం పడుతున్న విషయాన్ని గ్రహించి 5శాతం చేయడంతో పేద ప్రజలపై భారీగా భారం తగినట్లు అయిందని అన్నారు. దీనితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవనున్నట్లు వడ్డేపల్లి తెలియజేశారు. అనంతరం కంచి మహేందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం దేశ ప్రజలందరికీ ఎంతో మేలు చేస్తుందని సాధారణ కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడమే కాకుండా వ్యాపారులకు, రైతులకు కూడ ఊరటనిస్తుందని తెలియజేశారు. ప్రజల హితాన్ని కోరే ప్రధానమంత్రి మోడీ సేవలు ఎల్లప్పుడూ పేదలకు అనుకూలంగా ఉంటుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ బిజెపి నాయకులు రఘు యాదవ్, సతీష్ గౌడ్, బానిష్, రఘు, శివ, ఉషారాణి, మహాలక్ష్మి , అశోక్, వినీత్ యాదవ్, బత్తి రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ సేవలు చిరస్మరణీయం

### -నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి పద్మజ

**చిక్కడపల్లి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** తెలంగాణ సాహిత్యానికి, సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనం పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు అని నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి పద్మజ అన్నారు. మంగళవారం అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో మహా కవి కాళోజి నారాయణరాయణ జయంతి సభ జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన పద్మజ మాట్లా దుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక ఉద్యమకారునిగా, కవిగా తెలం గాణ సమాజానికి కాళోజీ చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. అన్యాయం ఎక్కడ జరిగినా కాళోజీ గళమెత్తేవారని, అసమానతలు, దోపిడీ, నిరాదరణకు గురవు తున్న వారిలో ఆయన కలం చైతన్యాన్ని నింపిందని గుర్తు చేశారు. ముఖ్యంగా స్థానిక భాషకు ప్రాధాన్యతనిచ్చి ఎవరి వాడు క భాషను వారు రాయాలని, ఇతరుల భాషను అనుకరించే బానిస భావన పోవా లని, ఆయన తపించిన తీరుతో ప్రతి ఒక్కరి లో ఆత్మగౌరవం వెల్లబికుతుందని అన్నా రు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ గ్రంథ పాలకులు ఎల్ చంద్రకళ, బి ప్రతిభా రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఎం వెంకటేష్ యాదవ్, కె వెంకటేశ్వర్ రెడ్డి, పి వి ఎం కృష్ణారెడ్డి, గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొ ని నివాళులు అర్పించారు.



అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో కాళోజి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పద్మజ తదితరులు

### ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

**జీడిమెట్ల, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తూటాల వంటి కవితలు, నిప్పురవ్వ లాంటి మాటలతో యువతను, తెలంగాణ జాతిని చైతన్యవంతం చేసిన మహాకవి కాళోజి నారాయణరావు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. టీవీఆర్ మోడల్ హైస్కూల్ అపురూప కాలనీ, ఎస్ ఆర్ నాయక్ నగర్‌లోని సత్యవాణి విద్యా నికేతన్ హై స్కూల్‌లలో మంగళవారం కాళోజీ నారా యణరావు 111వ జన్మదినాన్ని పురస్కరిం చుకొని తెలంగాణ భాష దినోత్సవాన్ని వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, తెలుగు డిపార్ట్మెంట్ అధ్యాపక బృందం, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

### కాళోజ జీవితం స్ఫూర్తిదాయకం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ విమోచనోద్యమం–కాళోజీ కవిత్వం' పేరుతో నిర్వహించిన స్మారకోపన్యాసంలో కేంద్ర సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ) జనరల్ కౌన్సిల్ సభ్యుడు, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు. కాళోజీ జీవితం మొత్తం సమాజాభివృద్ధికి పాటుపడ్డారని, ఆయన నిరాడంబర జీవితం భావితరాలకు ఆదర్శనీయం అని కొనియాడారు. సామాన్యులను ఆయన చైతన్యవంతులను చేశారన్నారు. ఎన్నో సామాజిక ఉద్యమాలలో పాల్గొన్న ఘనత ఆయనకుందన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ ఆచార్య ఘంటా పుష్పచక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి, ఆచార్య ఆనంద్ పవార్, ఆచార్య వడ్డాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.



టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కాళోజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, బోధన సిబ్బంది

### వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..



**అత్తాపూర్ సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ లోని పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కాళోజీ నారాయణరావు బహుభాషా కోవిదుడని రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలని కోరారు.

## ఆటో డ్రైవర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన నిందితులపై కేసు నమోదు

**బేగంపేట సెప్టెంబరు 9,ప్రభాతవార్త :** ఫేస్ బుక్ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపడంతో పాటు స్నేహాన్ని అంగీకరించిన ఆటో డ్రైవర్ ను బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరిస్తున్న నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట రసూల్‌పురాకు చెందిన ఆటో డ్రైవర్ (39)కి జులై నెల 12వ తేదీన ఫేస్ బుక్ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. దీంతో బాధితుడు స్నేహాన్ని అంగీకరించాడు. ఆ తర్వాత వారిద్దరి మధ్య చనువు ఏర్పడటంతో వాట్సప్ ద్వారా వీడియో కాల్ మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో బాధితుడి నగ్న వీడియోలను సేకరించిన ఆగంతకుడు ఆ తరువాత అతన్ని బెదిరించడం మొదలు పెట్టాడు. తనకు కావాల్సిన డబ్బు ఇవ్వకపోతే వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించాడు. డబ్బు పంపడం కోసం ఓ మొబైల్ నంబరను కూడా పంపాడు. దీంతో భయపడిన ఆటో డ్రైవర్ రూ 34,500లు నగదును అతని అకౌంట్‌కు బదిలీ చేసాడు. మరికొంత డబ్బులు కావాలంటూ మరో సారి బెదిరించడంతో బాధితుడు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సెల్‌ఫోన్ చోరీ.. బ్యాంకు ఖాతా నుంచి రూ.6.లక్షలు విత్‌డ్రా

**కంటోన్మెంట్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** దొంగిలించిన సెల్‌ఫోన్ నుంచి రెండు బ్యాంక్ ఖాతాల ద్వారా ఓ దుండగుడు 6.15 లక్షల రూపాయలను తన ఖాతాలో డ్రా చేసుకున్న సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా బోదన్‌కు చెందిన ఎం.ప్రసాద్ రావ్ అనే వ్యక్తి ఈ నెల 6వ తేదీన బోయిన్‌పల్లి బస్టాప్‌లో నాందేడ్‌కు వెల్లే బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి అతని సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. దీంతో ప్రసాద్ రావ్ బోదన్‌లో కొత్త ఫోన్ కొనుగోలు చేసి తన పాత నెంబర్‌పై సిమ్ తీసుకొని తన ఫోన్‌లో వేసుకొని తనిఖీ చేస్తున్నప్పుడు అతని కెనరా బ్యాంక్ ఖాతా నుంచి రూ.4 లక్షలు, మరో సేవింగ్ ఖాతా నుంచి రూ.2.15 లక్షలు డ్రా అయినట్లు మెస్సెజ్ చూపించింది. బాధితుని ఖాతాల నుంచి ఫోన్‌పే యాప్ ద్వారా డబ్బులు డెబిట్ అయ్యాయని గ్రహించిన బాధితుడు ఈ నెల 8న సాయంత్రం బోయిన్‌పల్లి పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. దొంగిలించిన సెల్‌ఫోన్ నుంచి పాస్ వడ్ ఎలా గుర్తించాడని పోలీసులు వివిధ కోణాలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ తిరుపతిరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ దర్యాప్తు చేస్తున్నారు.

## ఫైర్ స్టేషన్ కోసం గ్రామ కంఠం భూమి స్వాధీనం

**అల్వాల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** అల్వాల్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి ఎట్టకేలకు కదలిక వచ్చింది. పోలీసు స్టేషన్ పక్కగా ఉన్న సుమారు 11 గుంటలు స్థలాన్ని అగ్నిమాపదక దళం విభాగం మంగళవారం స్వాధీనం చేసుకుంది. స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటును ప్రారంభించారు. సంబంధిత స్థలం కొంత బాగంలో పేదలు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని సంవత్సరాలు కాలంగా నివాసం ఉంటున్నారు. శనివారం లోపు స్థలాన్ని ఖాళీ చేయాలని సిబ్బంది గుడిసె వాసులకు అదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు స్థలం స్థానిక యూత్ అసోసియేషన్ ఆధీనంలో ఉంది. స్వర్గీయ స్థానిక శాసనసభ్యుడు పి.జనార్ధన్ రెడ్డి ఇదే స్థలంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కోసం శంఖుస్థాపన కూడా చేశారు. న్యాయపరమైన వివాదాలు నేపథ్యంలో హాల్ ఏర్పాటుకు సంబంధించి పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి స్థలం ఖాళీ ఉంటోంది. యువజన సంఘానికి చెందిన ప్రతినిధులు ప్రతి ఏడాది ఇక్కడ ఆగస్టు 15వ తేదీన జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోంది. ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం పరంగా అనుమతులు లభించడంతో అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

## అర్కేడియా వాసులకు మంచినీటి పునరుద్ధరణ

**అల్వాల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** కౌకూర్ జనప్రియ అర్కేడియా వాసులు మంచినీటి సమస్య తీరింది. సాంకేతిక పరమైన సమస్యలు నేపథ్యంలో మంచినీటి కనెక్షన్‌లను జలమండలి తొలగించడం జరిగింది. ప్రజలు సమస్యను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకుని వెళ్ళారు. మైనంపల్లి జలమండలి ఎండి అశోక్‌రెడ్డి, జనరల్ మేనేజర్ సునీల్ తదితర అధికారులుతో చర్చించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జనప్రియ అర్కేడియా వాసులకు మంచినీటి కనెక్షన్‌లను పునరుద్దించారు. ఈ కార్యక్రమంలో స్థానికులుతో పాటుగా కాంగ్రెస్ సీనియర్ నేత మల్లిఖార్జున్ ఇతరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ఉత్సవంలో ఓ దృశ్యం

## ఘనంగా ముగిసిన తెలుగు భాషా వారోత్సవాలు

**అల్వాల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** బొల్లారం రాష్ట్రపతి నిలయంలో తెలుగు భాషా వారోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. తెలుగు భాషావేత్త శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినం ఆగస్టు 29న ఉత్సవాలు ప్రారంభమై ప్రజాకవి శ్రీ కాళోజీ నారాయణరావు జన్మదినం సెప్టెంబరు 9 తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు గోడ ప్రదర్శన, వక్తృత్వం, వ్యాస రచన, ప్రశ్నోత్తర, జానపద కథల పోటీలలో పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు రోజు శ్రీ కాళోజీ నారాయణరావు, గిడుగు రామమూర్తిలుపై డాక్యుమెంటరీ, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పోటీలులో గెలుపొందిన విద్యార్థులకు సంగీత దర్శకుడు, గాయకుడు, రచయిత చరణ్ అర్జున్, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్ రమేష్ సుంకసారిలు బహుమతులు ప్రదానం చేశారు.

## 48 గంటలు మంచినీటి సరఫరాకు అంతరాయం

(మొదటి పేజీ తరువాయి)

గాయత్రీనగర్, బాబానగర్, కెపిహెచ్‌బి, బాలాజీనగర్, హస్మత్‌పేట సెక్షన్, ఓ అండ్ ఎం డివిజన్ 12: చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గజులరామారం, సూరారం, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ సెక్షన్, ఓ అండ్ ఎం డివిజన్ 8: అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మాచ్చబోల్లారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయి నగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతమ్‌నగర్, సాయినాథ్‌పురం సెక్షన్, మౌలాలి రిజర్వాయర్. ఓ అండ్ ఎం డివిజన్ 14: (కాప్రా మున్సిపాలిటీ పరిధి): చర్లపల్లి, సాయిబాబానగర్, రాధికా సెక్షన్లు, కైలాసగిరి పాత, కొత్త రిజర్వాయర్ ప్రాంతాలు, హౌసింగ్ బోర్డు సెక్షన్, మల్లాపూర్ కొంత భాగం, ఓ అండ్ ఎం డివిజన్ 15: కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్ కొంత భాగం, గచ్చిబౌలి కొంత భాగం, నల్లగండ్ల కొంత భాగం, ఓ అండ్ ఎం డివిజన్ 17: హఫీజ్‌పేట్, మియాపూర్ సెక్షన్లు, ఓ అండ్ ఎం డివిజన్ 19: పోచారం, ఓ అండ్ ఎం డివిజన్ 21: కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూముకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం సెక్షన్, అయ్యప్పకాలనీ రిజర్వాయర్ ప్రాంతాలు, ఓ అండ్ ఎం డివిజన్ 22: నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం, బౌరాంపేట్ సెక్షన్లు, ట్రాన్స్‌మిషన్ డివిజన్ 4: ఎంఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్, ఏఐఎంఎస్బి బినగర్, గ్రామీణ నీటి సరఫరా ఆఫ్‌టేక్స్: అలేర్ (భువనగిరి), ఘన్పూర్ (మెద్చల్/శామీర్‌పేట్) ప్రాంతాలు. ఈ ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

## గ్రేటర్‌లో 33 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు

(మొదటి పేజీ తరువాయి)

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి లు ప్రారంభించారు. వారు విజయవంతంగా క్యాంటీన్ ను నడుపుతూ, ఉద్యోగులు, సందర్శకులకు సేవలందిస్తున్నారు. వీరి ప్రయాణం నగరంలోని అనేక మహిళా సంఘాలకు స్ఫూర్తిగా మారింది. క్యాంటీన్ నిర్వాహకురాలు వసంత తన సక్సెస్ జర్నీని పంచుకుంది. ఈ అవకాశంతో నాకు, క్యాంటీన్ లో భాగస్వాములైన మహిళలకు ఆర్థిక భద్రత లభించింది. మా కాళ్లపై నిలబడగలిగాము అంటూ ఆనందం వ్యక్తం చేసింది.

## ముమ్మరంగా స్లాటర్ హౌస్ పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసినందున త్వరగా టెండర్లను పిలిచి పనులను త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు . ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల ఉండేలా చూడాలని కమిషనర్ ప్రాజెక్టు ఇంజినీర్లకు ఆదేశించారు. పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజారోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలు తక్షణమే తొలగించాలని, శుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## జిహెచ్ఎంసి ఆస్తి పన్ను డేటా విద్యుత్ కనెక్షన్లతో అనుసంధానం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఈ చొరవ కార్పొరేషన్ ఆదాయ స్థావరాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించనుందని డేటా పారదర్శకత మరియు సామర్థ్యాన్ని కూడా పెంపొందిస్తుందని అన్నారు. కమిషనర్ ఆర్ వి కర్ణన్ మార్గదర్శనం మేరకు పారదర్శకతను పెంపొందించడానికి, ఇకపై ప్రకటన అనుమతులకు దరఖాస్తులను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించాలని, ఆఫ్‌లైన్ విధానాన్ని నిలిపివేయాలని అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలోఐటీ జాయింట్ కమిషనర్ రాధ,డిప్యూటీ కమిషనర్ (అడ్వర్టైజ్‌మెంట్) పద్మ, ఏఈలు లు నవీన్, మలన్, బెలువా, భార్గవి, తిరుమల్, అభిలాష్,కార్తీక్, సాయిరామ్ లు పాల్గొన్నారు.

## మహిళా డాక్టర్‌ను మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

**అల్వాల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** ఆన్‌లైన్ పరిచయస్తుడిని నమ్మిన ఆ మహిళా డాక్టర్ లక్షలు రూపాయలు మోసానికి గురైంది.పెళ్ళి చేసుకుందామని నమ్మబలికిన నిందితుడు అవసరాలు ఉన్నాయంటూ ఏకంగా 35లక్షలు కాజేసి మోహం చాటేశాడు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్, హెచ్ఎంటి కాలనీలో నివసించే వైద్యురాలు(30)కి గత ఏడాది ఆన్‌లైన్ ద్వారా సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం(34) పరిచయం అయ్యాడు. తనకు పెళ్ళి కాలేదని నిందితుడు చెప్పడంతో ఆన్‌లైన్ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. సుబ్రహ్మణ్యం మత్తులో పడిన వైద్యురాలు అవసరాలు కోసం అంటూ డబ్బును అడగడం ప్రారంభించాడు. 25లక్షలు నగదుతో పాటుగా తల్లికి చెందిన 15తులాలు బంగారు ఆభరణాలు సైతం ఇచ్చింది. వివాహం చేసుకుందామని బాధితురాలు ఒత్తిడి పెంచడంతో సుబ్రహ్మణ్యం మోహం చాటేయడంతో పాటుగా వైద్యురాలి ఫోన్ నెంబరును సైతం బ్లాక్ చేయడం జరిగింది. ఆరా తీయగా సుబ్రహ్మణ్యంకు గతంలోనే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తేలింది. మోస పోయినట్లు గుర్తించిన ఆమె అల్వాల్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి.. రూ. 3.04 లక్షలు టోపీ

**హైదరాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా రూ. లక్ష పర్సనల్ లోన్ ఇస్తామని నమ్మించి ఓ యువకుడి ఖాతా నుంచి రూ. 3.04 లక్షలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడకు చెందిన ఓ యువకుడు(34)కు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, బజాజ్ ఫిన్ సర్వ్ అనే సంస్థ ఏజెంట్లుగా పరిచయం చేసుకున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు అవసరం లేకుండానే రూ. లక్ష రుణం ఇస్తామని నమ్మబలికారు. దీంతో నిజమేనని నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా తన పూర్తి వివరాలను వారికి తెలియజేశాడు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం లోన్ మంజూరు అయ్యిందంటూ నకిలీ పత్రాలను చూపిస్తూ పలు దఫాలుగా బీమా, టీడీఎస్, జీఎస్టీ, ఆర్బీఐ తదితర ఛార్జీల పేరుతో రూ. 3.04 లక్షలు కాజేశారు. బాధితుడు చెల్లించిన మొత్తాన్ని లోన్ డబ్బులతో కలిపి తిరిగి చెల్లిస్తామని వాగ్దానం చేశారు. మళ్లీ ఇతర ఛార్జీలు అడుగుతుండటంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు మంగళవారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు

## అలుపెరగని పోరాట యోధుడు జయశంకర్

**కొంపల్లి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడని కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కొంపల్లి పురపాలక సంఘ కార్యాలయములో నిర్వహించిన జయశంకర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డి.ఈ.ఈ తిరుపతి, మునిసిపల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొనారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఎస్.ఆర్.నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివివరాల ప్రకారం ఎస్.ఆర్.నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్.నగర్ బస్టాప్ వద్ద దాదాపు 60 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు గల వృద్దుడి మృతదేహం లభ్యమైంది సమాచారం రావడంతో వారి సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా వృద్దుడు మరణించినట్లు తెలియేశారు. మరణించిన వృద్దుడు గోధుమ రంగ చొక్కా, నలుపు రంగు పాయింట్‌ను ధరించినట్లు తెలిపారు. అనంతరం చుట్టు ప్రక్కల వారిని ఆరా తీయగా అతను పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుంటూ ఫుట్‌పాత్‌పై పడుకుంటాడని స్థానికంగా ఉన్నవారు తెలిపారు. ఈ మృతదేహాన్ని గాంధీ పోస్ట్ మార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉన్నట్లైతే ఎస్.ఆర్.నగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్‌కు సత్కారం

**నిజాంపేట్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆత్మకూరి క్రాంతి కిరణ్‌ను పలువురు కార్యకర్తలు ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు దాసి నాగరాజు అధ్యర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు.

IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD
E.P. No 114 OF 2023
IN
O.S. No 2450 OF 2007

Between:
**M/s. RAINBOW,** A Division of M/s. Ushakiron Movies Limited, Rep. by its GPA Holder Kona Veera Raghava Rao.
...Decree Holder/Plaintiff
AND
**M/s. AMATEUR CREATIVE TEAM WORKS,** Rep. by its Proprietor, J Prem Reddy ....Judgement Debtor/ Defendant

To,
**M/s. AMATEUR CREATIVE TEAM WORKS,** Rep. by its Proprietor, J Prem Reddy, S/o Late J Peddi Reddy, Office situated at 1-1-572, Flat No 106, S.K.Fort House, Golconda X Roads, Hyderabad. Also Resident of H.NO.3-5-3/1, Ram Koti, Hyderabad.

Whereas the Decree Holder/Plaintiff filed the above EP against you for recovery of a sum of **Rs.6,82,346.00/-** The above EP is posted to **26-09-2025** for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any At 10-30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the EP will be heard and determined exparte and orders pass accordingly.

**(BY ORDER OF THE HON'BLE COURT)**
**K. YADAGIRI RAO,** Advocate,
# 207 & 208, Aditya Towers, Vinayak Nagar, Neredmet, Secunderabad - 56.

IN THE COURT OF THE HON'BLE I ADDL.SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT
AT::MALKAJGIRI
O.S.No.382 OF 2024

**BETWEEN:**
Biriduraju Sowjanya
...Plaintiff
AND
B.Sai Pratyusha & others
...Defendants

To,
Ale Narendar, s/o. late Ale Yadagiri, (Defendant No.5), Age about 37 years, Occ: Business, R/o. H.No.2-21-93/13/1, Chilka Nagar, Uppal village and Mandal, Medchal-Malkajigiri District.

That the Plaintiff has instituted the above suit and other I.As., against you & others in the above said Hon'ble Court seeking comprehensive reliefs by making you as defendant No.5, and the same is stood posted to 16.10.2025.

Hence, you are hereby informed to attend the above suit either in person or through your counsel duly instructed by 10.30 a.m., on 16.10.2025. Otherwise, the matter will be decided exparte.

By order of the Court
**Sd/- GAJJALA VENKATA REDDY**
**B.L., PGDADR(NALSAR), LL.M.(TS/1491/93)**
**ADVOCATE**
Chamber of Lawyers' Collective
Plot No.34/B, H.No.11-13-806, Road No.2, GREEN HILLS Colony, Kothapet, Hyd. -500102.
**Mobile:9989286688**

## పేదలకు అండ సిఎం రిలీఫ్ ఫండ్

### : ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**తుర్కయంజాల్ సెప్టెంబర్ 9,ప్రభాతవార్త :** తురకయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరు క్యాంపు కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిది పథకం చేయుతనందిస్తూ బాధితులకు ప్రభుత్వ అండగా నడుస్తుందని అన్నారు. అదేవిధంగా అబ్దుల్లాపూర్మెట్ మండల్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ చెందిన ఆరోగ్యం సమస్యతో హాస్పిటల్లో చూయించు కోగా 22 మంది లబ్ధిదారులకు 927000 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కర్ చారి, మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందాల రంగారెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, కిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె వెంకట్ రెడ్డి, ధన్పాల్ రెడ్డి, మూల కిరణ్ అంతటి ధనరాజ్, రాజు నాయక్, రాజ్యాం, నాయక్ మరియు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గురువులను గౌరవించుకోవడం మన బాధ్యత



పివి లక్ష్మీని సన్మానిస్తున్న పివిపి అంజనీకుమారి తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**
గురువులను గౌరవించుకోవడం మన బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర సిఎస్సి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి ఆంజనీ కుమారి పేర్కొన్నారు. శిఖరం అధినేత కృష్ణ ఆధారంలో శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులకు, సమాజానికి తమ వంతు సేవలు అందిస్తున్న సమాజ సేవకులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా అంజనీకుమారి మాట్లాడుతూ గురువులు లేకపోతే మానవ మనుగడ లేదన్నారు. విద్యాసంస్థల అధినేత కోటిరెడ్డి, ప్రొఫెసర్ సత్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కోదాటి అరుణ, విద్యాసంస్థల అధినేత, ప్రముఖ గాయని పీవీ లక్ష్మి, రాగరంజని, సాయి, అరికెపూడి రఘు లకు అవార్డులను అందజేశారు. సభాధ్యక్షులుగా, వ్యాఖ్యాతగా లంక లక్ష్మీనారాయణ వ్యవహరించగా, కోటిరెడ్డి, చక్రపాణి, దామోదరం, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెఆర్ నగర్లో కార్పొరేటర్ పాదయాత్ర



**మల్కాజిగిరి సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బి జె ఆర్ నగర్ లో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు.ఈ సందర్భంగా కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలు కమిటీ హాల్ నిర్మాణము కొరకు ప్రపోజల్స్ సిద్ధం చేయాలని అలాగే పెండింగ్లో ఉన్న రోడ్లను పూర్తి చేయాలని ట్రాన్స్ఫార్మర్ కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది వెంటనే స్పందించి అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో డి ఈ లౌక్య, దివ్య జ్యోతి, జలమండలి మేనేజర్ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, బాబు, ఆంటోనీ, కిషోర్, కాలనీవాసులు పుట్ట శ్రీనివాస్, నర్సింగరావు, మహబూబ్, సంతోష్, కృష్ణ స్వామి, ఈశ్వర్, శివా, ఇబ్రహీం, శంకర్, మల్లేష్, షాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం

### -ఇద్దరి అరెస్టు



అరెస్టు చేసిన నిందితులు, స్వాదీనం చేసుకున్న గంజాయితో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు.

**హయత్ నగర్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**
ఒడిస్సా నుండి నగరానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇరువురు నిందితులను రంగారెడ్డి జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అదుపులోకి తీసుకుని వారినుండి 21.33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... ఒడిస్సా నుండి బస్సులో గంజాయిని తరలి స్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా ఎన్ఫోర్స్మెంట్ బృందలు అబ్దుల్లాపూర్ మెట్ లో బస్సు ను ఆపి తనిఖీ చేసారు. బిరెన్ నాయక్, రాజేంద్ర చెట్టిలు సూట్ కేస్ లలో అనుమానం రాకుండా గంజాయిని ఒడిస్సా నుంచి నగరానికి తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేసారు. ఒడిస్సా రాష్ట్రం జైపూర్ కు చెందిన కుష్బూ నాయక్ నగరంలో గంజాయి డెలివరీ చేయాల్సిందిగా ఆదేశించినట్లు నిందితులు తెలిపారు. గంజాయిని ఎవరికీ అందించాలన్న విషయం నిందితులకు తెలియదని.. కుష్బు నాయక్ కు మాత్రమే తెలుసని ఎంఫోర్స్మెంట్ అధికారులు తెలిపారు. తదుపరి దర్యాప్తు కోసం అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయిని హయత్ నగర్ పోలీసులకు అప్పగించారు.



ముసారాంబాగ్ డివిజన్లోని శాలివాహన నగర్లో బొక్క గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

# 14వ తేదీన మిలద్ ఉన్ నబి జులుస్ ర్యాలీ

**-మర్కాజే మిలద్ కమిటి కన్వీనర్ హాఫేజ్ ముజఫర్**



సమావేశంలో మాట్లాడుతున్న మర్కాజే మిలద్ జులూస్ కమిటీ కన్వీనర్ హాఫేజ్ ముజఫర్ , చిత్రంలో కమిటి సభ్యులు తదితరులు

**మలక్ పేట, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** ఈ నేల 14వ తేదీ ఆదివారం మార్కజే మిలాద్ జులూస్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మిలాద్ ఉన్ నబి జులూస్ ర్యాలీ ని నిర్వహించనున్నట్లు మార్కజే మిలద్ జులూస్ కమిటి కన్వీనర్ హఫేజ్ ముజఫర్ ఖాన్, కమిటి అధ్యక్షుడు కామిల్ పాష తదితరులు పేర్కొన్నారు. చారిత్రాత్మక చార్మినార్ నుంచి భారీ ర్యాలీ ఉంటుందని వారు వివరించారు. ఇదీబజార్ లోని హాఫేజ్ ముజాఫర్ ఆలీ ఖాన్ నివాసం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ మిలాద్ ఉన్ నబి ర్యాలీలో ప్రజలు, యువకులు అదిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు. పలు సంవత్సరాల నుంచి మిలద్ ఉన్ నబి జులూస్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి ఉత్సవాలు కలసి రావడం తో మార్కజీ మిలాద్ జులూస్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నేల 14 వ తేదీన మిలాద్ ఉన్ నబి జులుస్ ర్యాలీని నిర్వహిస్తున్నమని తెలియజేశారు. ఆదివారం మధ్యాహ్నం జోహార్ నమాజ్ మక్కా మస్జిద్ లో చదివిన అనంతరం మత పెద్దలు చార్మినార్ వద్ద జండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ర్యాలీ గుల్జర్ హౌస్, పత్తర్ గట్టి, మదీనా చౌరస్తా, సాలర్ జంగ్ మ్యూజియం, దారుల్ షిఫా, పురాని హవెలి, మీర్ ఆలం మండి, ఏతేబర్ చౌక్, అలిజా కోట్ల, మొఘల్ పురా వాల్టా హోటల్ వద్దకు చేరుకుని ముగుస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరు మహమ్మద్ ప్రవక్త చెప్పిన మార్గంలో నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మార్కజే మిలాద్ జులూస్ కమిటీ ప్రతినిధులు జునైద్ పాషా, సైఫ్ పాషా, హఫీజ్ ముజాఫర్ ఆలీ ఖాన్, శుజాద్దీన్ ఇఫ్తేకర్,ఆలీ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం

**-రహదారుల పక్కన యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు**
**-టౌన్ ప్లానింగ్ చేతివాటంతో రెచ్చిపోతున్న నిర్మాణదారులు**
**-నోటీసులు ఇస్తున్నామని చేతులు దులుపుకుంటున్న వైనం**
**-చేయి తడపందే ఏ పని ముట్టుకోరు**
**-టీపిఓగా పనిచేసి ఏసీబీకి పట్టుబడ్డ మణిహారిక**



అక్రమ నిర్మాణాల దృశ్యం

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** ఏసీబీకి పట్టుబడ్డ ప్రవర్తన మార్చుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు. చేతివాటాన్ని ప్రదర్శిస్తూ జేబులు నింపుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నరనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ అధికారులు భేకాతర చేస్తున్నారు. ముఖ్యంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల్లో ఎటువంటి చలనం లేదు. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో వందలాది అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఫిర్యాదుదారులు అధికారుల తీర్పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి పలుసార్లు సాధారణంగా ఫిర్యాదు చేసిన పట్టించు కోలేదు. దీంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా చర్యలు చేపడతారని భావించి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఫిర్యాదుదారులు అవాక్కవుతున్నారు. ఫిర్యాదు చేసిన విషయం గురించి టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు గుర్తుచేసినప్పటికీ ఇదిగో అదిగో అంటూ నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారు. చేతివాటానికి అలవాటు పడ్డ అధికారులు సిబ్బంది అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి లక్షలాది రూపాయలు చేతులు మారుతుండడంతో ఫిర్యాదులపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లంచగొండి అధికారులు, సిబ్బంది కారణంగానే ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోంది. గతంలో అనేకసార్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తమ నిర్మాణదారుల వద్ద పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటున్నడంతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఈ సర్కిల్ పరిధిలో అనేకసార్లు అధికారులు సిబ్బంది ఏసీబీకి పట్టుబడినప్పటికీ బదిలీపై వస్తున్న ఇతర అధికారుల సిబ్బంది కూడా అదే బాటను పయనిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాల వ్యవహారం మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోందని పలువురు ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా మంగళవారం నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో టౌన్ప్లానింగ్ ఏసిపి మణిహారిక రూ.10లక్షలు లంచం డిమాండ్ చేయగా సదరు బాధితులు రూ.4లక్షలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. గతంలో మణిహారిక ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో టిపిఓగా విధులు నిర్వహించింది. ఎట్టకేలకు తన చేతివాటాన్ని ప్రదర్శిస్తూ నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో ఏసీబీ వలలో పడింది. ఇలా టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తుండటంతో అక్రమ నిర్మాణాల జోరుకు ఎవరు కళ్లెం వేయలేకపోతున్నారు. ఫిర్యాదులు చేసిన వారిపై ఒత్తిడి తీసుకువచ్చిన చర్యలు చేపట్టడం లేదంటే అధికారులు సిబ్బంది ఏ స్థాయిలో తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు బట్టలు అవుతోంది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు అవినీతి అధికారులు సిబ్బందిపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు చేపట్టాలని ఫిర్యాదుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలంగాణ భాషాదినోత్సవం

**నేరెడ్ మెట్, సెప్టెంబర్ 9,ప్రభాతవార్త.**



మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు 111వ జయంతి సందర్భంగా తెలంగాణ భాషాదినోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకను తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు.ముఖ్య వక్తగా హాజరైన ప్రముఖ పరిశోధకుడు డా. సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ..తల్లి కన్నడ, తండ్రి మరాఠీ అయినప్పటికీ కాళోజి అసలైన తెలంగాణ వాది, తెలంగాణవాదే" అని అన్నారు. నిజాం వ్యతిరేక పోరాటంలో కాళోజి గారి ధైర్యసాహసాలు అపూర్వమని, దుండగులు సభను కాల్చివేసినా మరుసటి రోజే అదే ప్రాంగణంలో సభ నిర్వహించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. నాజీల రాజ్యం ఇకెన్నాళ్లు?" అంటూ ప్రజల్లో ఆవేశాన్ని రగిలించిన ధైర్యవంతుడు కాళోజి అని తెలిపారు.అలాగే కాళోజి కవిత్వం సామాన్యులకు సులభంగా అర్థమయ్యే భాషలో ఉండి, సమాజంలోని అసమానతలను బలంగా ప్రతిబింబించిందని చెప్పారు. అన్నపు రాశులు ఒకచోట – ఆకలి మంటలు ఒకచోట.." వంటి పంక్తులు ఆయన కవిత్వంలోని సామాజిక స్పృహకు నిదర్శనమని వివరించారు. భిక్షకులను చూసినా కదిలిపోయే సున్నిత హృదయుడు కాళోజి అని, అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యం ఆయన ప్రతి మాటలో ప్రతిబింబించేదని డా. శ్రీనివాస్ గుర్తుచేశారు.కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా. అదవి రాజు మాట్లాడుతూ...అన్యాయాన్ని ఎదిరించిన వాడే నా ఆరాధ్యుడు" అని పేర్కొన్నారు. ఇలాంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలు తరచూ జరగాలని సూచించారు. తెలుగు అధ్యాపకురాలు పప్పుల శైలజ సమన్వయం చేస్తూ కాళోజి సాహిత్య విశిష్టతను వివరించగా, డా. బి. శోభన్ బాబు వందన సమర్పణ చేశారు.కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ గుణాకర్, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ డా. రాజేశ్ కుమార్, అధ్యాపకులు డా. స్వాతి, డా. లలిత, డా. హరిత, డా. అహల్య, డా. వెంకట్ రెడ్డి, డా. వినోద్ బాబు, మల్లిక, డా. జగన్, డా. యాదగిరి, డా. ప్రదీప్ తదితరులు విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో నూతన విద్యా విధానం రాబోతున్నది

**టిజిసిహెచ్ఇ చైర్మన్ బాలకృష్ణారెడ్డి**



బ్యాచులర్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న ఎంవిఎస్ఆర్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి: చిత్రంలో ఎంవిఎస్ఆర్ కాలేజీ చైర్మన్ పివిఆర్ కశ్యప్ తదితరులు ఉన్నారు.

**సరూర్నగర్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా నూతన విద్యా విధానం రాబోతున్నదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్ఇ) చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి వెల్లడించారు. ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒకటైన హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ మండలం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని నాదర్గుల్లోనున్న ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే -2025 వేడుకలు ఘనంగా జరిగాయి. మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పివిఆర్ కశ్యప్ ఆధ్వర్యంలో కాలేజీ క్యాంపస్లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు 2021-2025 విద్యా సంవత్సరాలకు సంబంధించి బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న ఎంవిఎస్ఆర్ విద్యార్థులకు కాలేజీ తరపున సర్టిఫికెట్లను ప్రదానం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ పేరిట ప్రధాని దేశాన్ని, రైజింగ్ తెలంగాణ పేరిట సిఎం రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో నూతన ఎడ్యుకేషన్ పాలసీకి కసరత్తులు జరుగుతున్నాయని ఇందు కోసం సంబంధిత కమిటీ సమావేశాలు కూడా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే అప్డేట్ కావాలి నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే ఎప్పటికప్పుడు అప్డేట్ కావాల్సి ఉంటుందని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఇండియాను యువత దేశం అంటారనీ అయితే విద్యార్థులు/యువత చక్కని క్రమశిక్షణతో ఈ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి కృషి చేస్తుండాలని ఆయన సూచించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు. ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీ అయిన ఎంవిఎస్ఆర్ తమ కంటూ ఓ ప్రత్యేక విద్యా విధానంతో విద్యా రంగంలో ముందుకు పోతుండం హర్షణీయమన్నారు. ఈ కాలేజీలో నాణ్యమైన విద్య, ప్లేస్మెంట్స్ బాగున్నాయని ఆయన కితాబిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, డిఆర్డిఓ మాజీ చీఫ్ కంట్రోలర్, ఆకాష్ క్షిపణి సృష్టికర్త డాక్టర్ ప్రహ్లాద రామారావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కె.శశికాంత్లు మాట్లాడుతూ విద్యార్థులకు దిశానిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహణ కమిటీ కార్యదర్శి డాక్టర్ కెపి శ్రీనివాస్, కోశాధికారి జూపూడి సుధాకర్, సంయుక్త కార్యదర్శి సూర్య ప్రభాకర్, పలువురు సభ్యులు, కాలేజీ ప్రిన్సిపాల్, హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## కుళ్లిన పులిహోర ప్రసాదం పంపిణీ

### - ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

**సైదాబాద్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** చారిత్రక నేపథ్యం కలిగిన కర్మన్ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులకు కుళ్లిన పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేయడం కలకలం సృష్టించింది. కాకతీయ ప్రభువులచే సైతం పూజలందుకున్న స్వయంభు కర్మన్ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఇక భక్తుడు దేవాలయానికి వచ్చి పులిహోర ప్రసాదాన్ని తీసుకుని ఇంటికి వెళ్లి తినడానికి చేతిలోకి తీసుకుని చూడగా కుళ్లిపోయి కనిపించడంతో తనకు తెలిసిన దేవాలయ ధర్మకర్తకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో కుళ్లిన పులిహోర ప్రసాదం పంపిణీ గురించి దేవాలయ సిబ్బంది, ధర్మకర్తలు, అర్చకుల్లో పెద్ద చర్చ జరిగింది. కుళ్లిన పులిహోర ప్రసాదంపై ఎవరికి వారు ఇతరులపై నెపం వేస్తూ తప్పించుకునే విధంగా మాట్లాడడంతో కాసేపు రభస జరిగినట్లుగా తెలుస్తుంది.

**అందుబాటులో లేని చైర్మన్, ఈఓ....**

దేవాలయ కార్యనిర్వాహణాధికారి, పాలక మండలి చైర్మన్లు ఇద్దరు మంగళవారం దేవాలయంలో లేక పోవడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా ఉన్న కర్మన్ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో సారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజ

**: ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్**



మహేష్ కుమార్ గౌడ్కు శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట్ల లడ్డు పటేల్, నాయకులు హరి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల జీవితాల్లో వెలుగు: విజయరంగ



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విజయరంగ

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**
విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి భారత బావిపౌరులుగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దడం అభినందనీయమని లైన్స్క్లబ్ హెల్త్క్యాంప్ జిల్లా చైర్మన్, స్వచ్ఛభారత్ జిల్లా కార్యదర్శి డాక్టర్ బి.విజయరంగ పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపేటలోని సీనియర్ సిటిజన్ భవనంలో సత్యనారాయణరెడ్డి, కె.రాధరెడ్డి ఉపాధ్యాయులను ఆయన పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, దశాబ్దాలుగా విద్యార్థులకు బోధన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు సాధించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నదానం కమిటీ చైర్మన్ రేణిగుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనగర్కాలనీలో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత



ఉప్పల్ శ్రీనగర్కాలనీలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్లోని శ్రీ నగర్ కాలనీ నూతనంగా చేపట్టిన రూ.15లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి మాజీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ జిహెచ్ఎంసి అధికారులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ శ్రీనగర్ కాలనీలో రూ.15 లక్షల సిసి రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణ సమయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ ఉండాలని, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలలో పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ వినల్ గౌడ్, ఎఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్, సీనియర్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, కొక్కంద జగన్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బాలు, బంటి గౌడ్, శ్రీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు కొండయ్య, ఓం ప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతాప్సింగారంలో పేదలకు వైద్య సేవలపై చైతన్య సమావేశం

**నేరెడ్ మెట్, సెప్టెంబర్ 9:ప్రభాతవార్త**



పేద, బీద ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయాలని లక్ష్యంగా ప్రతాప్ సింగారం గ్రామంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు డా. జి.పి.ఆర్ ఆధ్వర్యంలో ఆరోగ్య చైతన్య సమావేశం జరిగింది. శ్రీ గుబ్బరిగుట్ట మైసమ్మ దేవాలయం, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం గెస్ట్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి టి.ఆర్. పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గౌరవ డా. వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రాంతీయ స్థాయిలో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండి, తమ పరిధిలోనే ప్రాథమిక చికిత్స చేయాలి. రోగుల ఆర్థిక స్థితిని బట్టి అవసరమైనప్పుడు ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రులకు పంపాలి. కేవలం చికిత్స మాత్రమే కాకుండా పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించడం కూడా అత్యవసరం" అని సూచించారు. డా. శివారెడ్డి, డా. నారాయ ణ కృషిని గుర్తు చేస్తూ అభినందనలు తెలిపారు.

### హెచ్పిఎస్లో ఘనంగా తెలుగుభాషా దినోత్సవ వేడుకలు



రామంతాపూర్ హెచ్పిఎస్లో జరిగిన తెలుగుబాషా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపల్ డా.నల్లారం నరసింహారెడ్డి తదితరులు

**రామంతాపూర్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** రామంతాపూర్ లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో మంగళవారం తెలుగు బాషా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా భూషణుడు, ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 9వ తేదీన తెలంగాణ రాష్ట్రంలో తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం అనవాయితీ. ఈ సందర్భంగా రామంతపూర్ లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాల యాజమాన్యం నేతృత్వంలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు పద్య పఠనం, స్వగతం, కదజా రచన, వక్తృత్వం, దేశభక్తి గేయాలు, కవితా పఠనం తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం భాషా ప్రాముఖ్యతను తెలిపే పాటలు, నృత్యాలు, పద్య పఠనం ప్రదర్శించారు. అనంతరం పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల ప్రాచార్యులు డా. నల్లారం నరసింహారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషాగొప్పతనాన్ని శ్లాఘించారు. ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషను మరువకూడదనీ, దానిలోని మాధుర్యాన్ని ఆస్వాదించాలని కోరారు. గొప్పగొప్ప కవులను గుర్తు చేసుకుంటూ వారి కవితా ప్రాభవాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ దీపిక, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారులకు సన్మానం



బాలాపూర్ ఇన్స్పెక్టర్, ఎస్ఐలు, సిబ్బందిని సన్మానించిన నిరంజన్రెడ్డి తదితరులు

**సరూర్నగర్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** సుప్రసిద్ధ బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి సన్మానాలు చేసింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తును నిర్వహించి శాంతి భద్రతల పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నందుకు గాను బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్రెడ్డి ఆధ్వర్యంలో బృందం మహేశ్వరం అడిషనల్ డిసిపి సత్యనారాయణ, ఎసిపి జానకీరెడ్డి, బాలాపూర్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్ఐలు సుధాకర్, ప్రసాద్, కోటేశ్వర్రావు, సోహెల్తో పాటు బాలాపూర్, పహాడీ షరీఫ్ పిఎస్ల పోలీసు సిబ్బందికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారందరికీ శాలువాలతో సత్కరించి మినీ లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు సంరెడ్డి శ్రీనివాస్రెడ్డి, పన్నాల రాజేందర్రెడ్డి, టేకుల సుధాకర్రెడ్డి, కళ్లెం విష్ణువర్ధన్రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ట్యాంకును శుభ్రం చేయండి: బిజెపి



బిజెపి నాయకులు సంపుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన జాలిని తొలగించి అధికారులు పైకప్పును వేసిన దృశ్యం

**సరూర్నగర్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** బడంగ్పేట్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భూగర్భ మంచి నీటి సంపుపై కేవలం పైకప్పు వేస్తే సరిపోదనీ ఇప్పటికే కలుషితమైన సంపును వెంటనే పూర్తిగా శుభ్రం చేయించాలని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గ్రామానికి, కాలనీలకు మంచి నీటిని సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన భూగర్భ సంపు పైన ఉన్న రంధ్రం ద్వారా విద్యార్థులు భోజనం పేట్లు కడగడం వల్ల నీరు కలుషితం అవుతున్నదని తాము 20 రోజుల క్రితమే ఈ విషయాన్ని కమీషనర్ సరస్వతి దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోవడం బాధ కలిగించిందని ఆయన తెలిపారు. అయితే ఈ సమస్యపై తామే చొరవ చూపి సోమవారం పార్టీ నాయకులతో కలిసి సంపు రంధ్రంపై తాత్కాలికంగా జాలి వేసిన తర్వాతనే అధికారులు స్పందించి పైకప్పు వేశారని ఆయన వెల్లడించారు. పై కప్పు వేసినంత మాత్రం సరిపోదనీ ట్యాంకును మొత్తం శుభ్రం చేయించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.పాఠశాలలో తాగు నీటి సౌకర్యాలపై కార్పొరేషన్ వారు మానిటరింగ్ చేయాలనీ ఇందుకు కమిటీ వేయాలని ఆయన సూచించారు. మరో సారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని అన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడినా నిర్లక్ష్యం వహించినా బిజెపి చూస్తూ ఊరుకోదని ఆయన స్పష్టం చేశారు.

### బిజెపి రాష్ట్ర కార్యదర్శి వీరేందర్గౌడ్కు ఘన సత్కారం



బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తూళ్ల వీరేందర్గౌడ్ను సత్కరిస్తున్న ఉప్పల్ బిజెపి నేతలు

**ఉప్పల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బిజెపి సీనియర్ నేత, తూళ్ళ వీరేందర్ గౌడ్ను హబ్సిగూడకు చెందిన పలువురు బిజెపి నేతలు కలిసి సత్కరించారు. హబ్సిగూడ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి చెల్మోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో బిజెపి సీనియర్ నాయకులు బొమ్మగోని రఘుపతిగౌడ్, జిల్లెల రవీందర్ రెడ్డి ,బానోత్ రమేష్ నాయక్, జి హరిబాబు,అల్లాడి నిరంజన్ తదితరులు నాంపల్లి లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి అయనను కలిసి శాలువాతో సత్కరించారు. తూళ్ల వీరేందర్ గౌడ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.